
శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీ కీ జై!



# గురుకృప

రక్షణ-శిక్షణ

గురుపౌర్ణమి సంచిక


తనకున్నది పంచిపెట్టడం కాక తననే పంచిపెట్టుకున్న విరాట్ పురుషుడు
శ్రీసాయిబాబా



ఇలా కావలసినవి మన చెంతకు నడిచి వస్తుండగా, చేయవలసినది మన చేతుల మీదుగా
జరిగి పోతుండగా....జీవితం ఒక ముచ్చటగా, పండుగగా అనిపిస్తుంది.
ఇలా ఈ ముచ్చట కోసం ఎన్నిసార్లైనా ఈ సృష్టిలోనికి రావచ్చు అని అనిపిస్తుంది.
ఆయనకు ఇలా చేరువై లోక రూపంలో వున్న ఆయన్ను ఇలా సేవించుకునేటందుకై
మరలా మరలా వద్దాం.

సంపుటి : 13 | సంచిక : 3

# గురుకృప



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీ బాబూజీ



## లోపలి పేజీలలో

ఉన్నమాట - అనుకున్నమాట 4
- గురుబంధువులు

గురు వైభవం 5
- గురుకృప

అనుగ్రహ సునామీ 9
- బి.శ్రీనివాసులు రెడ్డి

తగిన రీతిన వర్తించు 10
- పార్థసారథి ప్రవచనాల నుండి

సాయి క్షేమ-సద్గురు ప్రేమ 12
- వెంకటేష్, స్రవంతి, సాయిక్షేమ

మీ చూపే తొలిమెట్టు 16
- ఉమాశంకర్

నిర్వహణ : **గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు**

GURUKRUPA, 2-1-6, Gandhi Chowk, Tenali-01.
Ph : 93933 61778
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.



# ఉన్నమాట - అనుకున్నమాట

శరత్, శరశ్చంద్ర గుప్తా, హోత్రస్ రైలు నిలయంలో స్టేషన్ మాస్టర్. సాధువర్తనుడు, సజ్జనుడు, దేహధారుఢ్యం కలవాడు. తన తొలి చూపులోనే 'ప్రేమ'లో పడ్డాడు, స్వామి వివేకానందను చూసి. స్వామీజీ హరిద్వార్ వెళ్లడానికి తన స్టేషన్‌కు వచ్చారు. చూపు త్రిప్పుకోలేని స్వామీజీ రూపును చూసి, తిన్నగా వారి వద్దకు పోయి "స్వామీజీ! ఆకలిగా ఉందా?" అని అడిగి, సాదరంగా తన గృహానికి ఆహ్వానించారు. చిన్నారిలా "నేను వస్తే ఏమిస్తావు?" అని అడిగిన స్వామీజీకి "ఓ నా దైవమా! నా హృదయాన్నే పిండి మధుర భక్ష్యాలు చేసి సమర్పిస్తాను" అనే ఒక గీతంతో జవాబు చెప్పాడు శరత్. కొన్ని రోజులు అక్కడ గడిపిన పిమ్మట స్వామీజీ యాత్రకు బయలుదేరారు. అప్పుడు శరత్ ఆయనతో "స్వామీజీ! నన్ను మీ శిష్యునిగా స్వీకరించండని" ప్రాధేయపడ్డారు. అప్పుడు "నాకు శిష్యునివైతే ఆధ్యాత్మిక జీవితంలో సమస్తమూ పొందవచ్చునని భావిస్తున్నావా? ఇది భగవంతుని లోకమనే భావంతో నువ్వు ఏం నిర్వర్తించినా పురోగమిస్తావు. నేను మాత్రం ఇప్పుడు హిమాలయాలకు వెళ్లి తీరాలి" అని జవాబిచ్చారు స్వామీజీ.

శరత్ వదిలిపెట్టలేదు "మీరు ఎక్కడకు వెళ్లినా నేను మిమ్మల్ని అనుసరిస్తాను" అన్నాడు స్థిర నిశ్చయంతో. అతని స్థిర నిశ్చయాన్ని గమనించిన స్వామీజీ, "అలాగా! నిజంగానే నీ వల్ల నన్ను అనుసరించడం సాధ్యమేనా? ఆ మనో నిశ్చయం నీలో ఉందా? అయితే చేత భిక్షాపాత్ర పుచ్చుకొని, నువ్వు పని చేస్తున్న ఆ రైలు స్టేషన్‌కు పోయి అక్కడ బరువులు మోసే కూలీల వద్ద భిక్ష అర్థించి రా" అన్నారు. శరత్ క్షణం కూడా సంకోచించలేదు. తక్షణమే బయలుదేరాడు. స్వామీజీ చెప్పినట్లే భిక్ష అర్థించి తీసుకువచ్చాడు. ఆ తరువాత కూడా అతణ్ణి నిరాకరించడానికి స్వామీజీకి ఎలాంటి కారణమూ కనిపించలేదు. నాడు వారి మధ్య మొదలైన బాంధవ్యం, గురు-శిష్య బాంధవ్యానికి ఒక సరికొత్త భాష్యం చెప్పింది.

ఆధ్యాత్మికత అడుగంటిన భారతజాతిని పునర్నిర్మించాలనే సత్సంకల్పము ఒక ప్రక్క, అందుకు తగిన సామర్థ్యము గూర్చిన శంక ఒక ప్రక్క వివేకానందులకు ఉన్న సమయంలో శరత్ "స్వామీజీ! ఇదిగో మీ శిష్యుణ్ని నేను ఉన్నాను. మీరు తలపెట్టిన కార్యం నిమిత్తం నేను ఏం చేయాలో ఆదేశించండి" అని హృదయాంతరాళాలలో నుంచి పలికాడు. గురుదేవుని అంతరంగాన్ని అవగతం చేసుకున్న సద్భక్తుడు శరత్.

గురుబంధువుల్లారా! ఇదంతా వివేకానందస్వామి ప్రథమశిష్యులైన శరత్ వృత్తాంతం. శరత్ గురుభక్తికి చుక్కాని. సద్గురు సంప్రదాయానికి దిశా నిర్దేశకుడు. శ్రద్ధా-సబూరీలనే ప్రాణవాయువుగా స్వీకరించి, గురువే దైవమన్న పరమసత్యాన్ని తెలుసుకున్న జ్ఞానశీలుడు. గురుపూర్ణిమ పర్వదినాన జ్ఞాన సూర్యుడు, ప్రేమ మహాసాగరుడు మరియు హిమాలయములు వలే శాంత స్వరూపుడు అయిన గురుదేవులను పూజించుకొనుట మన పరమధర్మము. మనమందరం కలసి సాయిని మనసా, వాచా, కర్మణా పూజించుకుందాం. మనందరికీ సద్గురు దర్శన భాగ్యాన్ని, గురుచరణ దర్శనాన్ని, వారి అమృత వాక్కుల శ్రవణాన్ని మనకు కల్గించమని వేడుకుందాం. శ్రీసాయికి మనమందరం ప్రయత్నపూర్వకంగా విన్నవించుకుందాం. సత్యమైన సాయిపథంలో పయనిస్తూ, సద్గురుని మాటను, బాటను దశదిశలా ప్రవర్తిల్ల చేస్తూ, గుడిలోను, గుడిసెలోను, గ్రామంలోను, పట్టణంలోను, ప్రతి జిజ్ఞాసువు యొక్క హృదయ మందిరంలో 'సాయి'ని ప్రతిష్టించేందుకు ఒక శరశ్చంద్రునిలా మనమూ ఒక దీపమవుతామని - ఎన్నో దీపాలను వెలిగిస్తూ, సద్గురు పదాన్ని, సద్గురు పథాన్ని మరింత దేదీప్యమానంగా, శోభాయమానంగా మలచుకొంటూ, శ్రద్ధ-సబూరీలతో గురువును పూర్ణంగా అవగతం చేసుకునే ప్రయత్నం చేస్తామని వినమ్రపూర్వకంగా సాయిని వేడుకుందాం.

**శ్రీసాయి అనుగ్రహ ప్రాప్తిరస్తు - సర్వులకూ సద్గురు చరణ దర్శన ప్రాప్తిరస్తు .**



# గురు వైభవం

మహాపురుషులు వాక్కు రూపంగా ఒకటి చెప్పడం, నిత్యాచరణ యందు అది లేకపోవడం, అలా వర్తించడం తెలియదు. పెద్ద పీట దేనికి అంటే నిత్యాచరణకు, నియమపాలనకు. నోటితో చెప్పడం కన్నా అనుష్టానమునకే పెద్దపీట వేసి, నిస్సంగులుగా నోరు విప్పి తాము మాట్లాడిన ఒక్కమాటతో లోకోద్ధరణ చేస్తూ ఉంటారు గురువులు. వారి మాట చాలు మనల్ని ఉద్ధరించడానికి. అటువంటి గురువుల యొక్క వైభవాన్ని ఈ గురుపూర్ణిమనాడు శ్రవణం చేద్దాం, పఠిద్దాం, అనుభవిద్దాం, ఆస్వాదిద్దాం.

గురువుకి, మేఘానికి దగ్గర పోలిక ఉంది. సముద్రంలో ఉన్న ఉప్పునీటిని కడుపునిండా త్రాగి తియ్యటి నీటిగా మార్చి ఆధారము లేని ఆకాశమునందు ప్రయాణం చేసి వచ్చి, ఒకరడిగారా, అడగలేదా అని చూడకుండా తనలో వున్నటువంటి తియ్యటి నీటినంతటిని అయిపోయే వరకు పూర్తిగా వర్షించేసి, హమ్మయ్య! నా దగ్గర నీటి చుక్క లేదని చెప్పి పొంగిపోయి తనకున్నదంతా ఇచ్చేసానని తెల్లగా దూదిపింజై వడివడిగా వెళ్లిపోతుంది మేఘం. తాను కష్టపడి అన్నీ తెలుసుకొని, ఎదుటివారు పిలిచారా, లేదా అని చూడకుండా, తన శరీరమునకు క్లేశము కలుగుతోందా, కలగడం లేదా అని చూసుకోకుండా తాను నేర్చుకున్నది వాగ్రూపముగా వర్షించడమే ప్రధానంగా పెట్టుకుని వర్షించి, వర్షించి హమ్మయ్య! నేను తెలుసుకున్నదాన్ని చెప్పేసానని పొంగిపోతాడు గురువు.

గురువు కేవలం ఒక మాట మాట్లాడడం చేత గురువు శిష్యుల యొక్క జీవితానికి కొత్త కోణాన్ని తొడగగలడు. కానీ ఎప్పుడు తొడగగలడు? శిష్యుడు కూడా అటువంటి అధ్యయన వ్యవసాయంతో గురువు చెప్పినటువంటి మాటలను వినడానికి సిద్ధపడి ఉండాలి. గురువు చెప్పినటువంటి మాటలు గాలికి పోతూ, శిష్యుడికి దానియందు ఏ విధమైనటువంటి పూనిక లేకుండా వింటుంటే – ఎలా అంటే, రోడ్డు మీద వెళుతున్నప్పుడు ఒక కారు హారన్ ఎలా వినబడుతుందో, లేకపోతే ఎక్కడో కూర్చుంటే ఏదో అనేకమైన శబ్ధములు ఎలా వినపడతాయో, అలాగే గురువాక్యములు కూడా కేవలం వినడం కొరకు మాత్రమే అనుకుంటే, దాని వలన ఉద్ధరణ ఏమీ ఉండదు. ఉద్ధరణ దేని వలన జరుగుతుంది అంటే గురువు నోటి నుండి వచ్చిన మాటని ఆచరణలో పెట్టుకోవడం వలననే ఉద్ధరణ వస్తుంది. మీరు ఒక్క విషయం ఆలోచించండి. మన సనాతన ధర్మమునందు గురువుకి వేసినంత పెద్దపీట మిగిలినటువంటి విశ్వాసములలో కనబడదు. ఇక్కడ గురువుకి చాలా పెద్ద స్థానమిస్తారు. అసలు ఒకరకంగా మాట్లాడాలంటే ఈశ్వరుడు గొప్పవాడా, గురువు గొప్పవాడా అని ఒక ప్రశ్న వేయవలసి వచ్చిందనుకోండి, నిష్పక్షపాతంగా చెప్పవలసి వస్తే ఈశ్వరుని కన్నా గురువే గొప్పవాడు. ఎందుచేతన అంటే గురువు లేనినాడు ఈశ్వరుడు తెలియడు. ఈశ్వరుని యొక్క అస్తిత్వం వున్నప్పటికి ఈశ్వరుడు వున్నప్పటికి, గురువు



దాని గూర్చి మాట్లాడలేదనుకోండి, గురువు చెప్పలేదనుకోండి, అసలు వాడున్నాడన్న విషయం ఎరుకలోనికి రాదు. ఎక్కడుంటాడండి భగవంతుడు. ఇక్కడే ఉంటాడు. ఇక్కడే భగవంతుడున్నాడు అన్న విషయం ఎలా తెలుస్తుంది? అసలు తెలిసే అవకాశమే ఉండదు. మనకు బయట తిరగడం అంతా తెలుసు. లోపలికి ఎలా వెళ్లడమో మనకి తెలియదు. మనలోకి వెళ్లి, మనలో వున్న ఈశ్వరుని ఎలా దర్శనం చేయవచ్చో చెప్పగలిగినటువంటి వాడు గురువు. అది కేవలం వాచా పాండిత్యమా! అయితే మరి ఇటువంటి గురువులు అన్ని కాలముల యందు లభ్యమై ఉంటారా? సమాజమునందు, అన్ని దేశముల యందు, అన్ని కాలముల యందు, అన్ని పరిస్థితుల యందు అందరికీ అందుబాటులో అలా గురువు ఉంటాడా? మరి ఎలా? అంటే శాస్త్రం ఇలా అంది. తామర పువ్వులు ఎక్కడున్నాయి? బురదలో వున్నాయి. బురద ఎక్కడ ఉంది? ఈ తామరమొగ్గ విచ్చుకోవడానికి – ఏది పడితే విచ్చుకుంటుంది? మీరు చెక్‌బుక్ తీసుకువెళ్లి తామరమొగ్గ దగ్గర పెట్టారనుకోండి – అది విచ్చుకోదు. లేకపోతే మన క్వాలిఫికేషన్ పట్టుకెళ్లి పెట్టామనుకోండి విచ్చుకోదు. భగవద్గీత పట్టుకెళ్లి చూపించామనుకోండి విచ్చుకోదు. ఏది పడాలి? సూర్యకిరణాలు పడాలి. పడితే విచ్చుకుంటుంది? సూర్యుడు ఎక్కడున్నాడు? ఆకాశంలో ఉన్నాడు. సూర్యకిరణముల స్పర్శ తగిలేటప్పటికి విచ్చుకునే లక్షణం తనయందు పెట్టుకున్న కారణం చేత (కిరణ స్పర్శతో రోజూ తామరమొగ్గలు విచ్చుకుంటున్నాయా లేదా) రోజూ విచ్చుకుంటున్నాయి. సూర్యుడు చాలా దూరంగా ఉన్నాడు. బురదలో వున్న మేము విచ్చుకుంటామా, లేదా అని తామరమొగ్గ ఎప్పుడైనా బెంగ పెట్టుకుందా? బెంగ పెట్టుకోదు. అటువంటిది గురువులేదని నీవు ఎలా అనుకుంటున్నావు? "అటువంటి గురువు" ఎప్పుడూ వున్నాడు. ఎలా వున్నాడు "శబ్ధరూపంగా" వున్నాడు.

మీరు శివానందలహరి చదువుతున్నారనుకోండి, ఆ చదువుతున్నపుడు మీరు లోపల స్మరణ చేస్తూ నిశ్శబ్ధంగా చదివితే లోపల చేస్తున్న ధ్వనిలో ఉన్నారు శంకరులు. పైకి చదివితే పైకి చెబుతున్నటువంటి ఆ శ్లోకం నందు, ఆ శబ్ధంనందు శంకరులు ఉన్నారు. ప్రస్ఫుటంగా ఆదిశంకరాచార్యుల వారు ఎక్కడుంటారు? అంటే సౌందర్యలహరి శ్లోకాలలో వుంటారని నిర్ణయం చేసారు. శబ్ధం–ఇతఃపూర్వం గురువు చెప్పిన మాట ఏదో – ఆ మాటే గురువు అయివున్నాడు. ***"గురువుకి – గురువాక్యానికి తేడా లేదు"***. గురువు యొక్క సందేశమంతా గురువాక్యంలోనే ఉంది. గురు వాక్యములు మీకు సిద్ధంగా వున్నాయా లేదా? మీరు కూడా సంసారమనే బురదలో ఉండే తామరమొగ్గ అయితే, సూర్య కిరణం నాకు తగులుతుందన్న పూనిక మీకు ఉంటే హృదయం విచ్చుకోవడానికి సద్గురువుల యొక్క సందేశములు సిద్ధంగా వున్నాయి. పుచ్చుకోవడానికి మీరు సిద్ధంగా వున్నారా? తామరమొగ్గ వుంది అలాగా. అలా ఉండి కిరణం పడితే అది విచ్చుకుంటుంది. సద్గురువుల సమస్త వాఙ్మయం వున్నది. మనం ఎంత



పుచ్చుకుంటున్నాం, అందులో? కొన్ని కోట్లు, కొన్ని లక్షలు పుట్టినది మొదలు శరీరం విడిచిపెట్టే పర్యంతమూ మనం ఎంత డబ్బు ఖర్చు పెట్టి తినేస్తున్నామో మీరు ఆలోచించండి. ఈ ఖర్చు పెట్టేటటువంటి ధనం నందు ఎక్కువ శాతం అవసరం లేని వస్తువు మీదే ఉంటుంది. ఇదిగో! ఇది తినడానికి, ఇది ఫెయిర్ & లవ్లీకి, ఇది పడుకోవడానికి, ఇది ఉండడానికి, ఇది ఎక్కి తిరగడానికి, దీన్ని ఆశ్రయించి వున్న వాళ్లని సుఖపెట్టడానికి... ఇవే అహంకారాలంటే. ఇవే లేనిపోని భేషజములు. భగవంతుని యందు బుద్ధి కుదరకపోతే, నా అంత తెలివైన వాళ్లు లేరనుకొని పప్పులో కాలు వేస్తుంటాడు. ఇంత డబ్బు మనం ఖర్చు పెడుతున్నాం. ఒక శివానందలహరి పుస్తకం ఖరీదు 15రూ.లు. శివానందలహరి పుస్తకం మీ ఇంట్లో ఉంటే ఆదిశంకరాచార్యులవారు మీ ఇంట్లో ఉన్నట్టే. కాని, ఎన్ని ఇళ్లలో శివానందలహరి ఉంటుంది. మనం ఇక్కడ ఉంటాం. శివానందలహరిని చేతిలో పట్టుకొని. దాన్ని చదివిన టైమ్ ఎంత? ఒకవేళ చదివాం, అది లోపలికి వెళ్లింది ఎంత? చదువుతున్నాం – కళ్లు చదువుతున్నాయి. కాని మనస్సు ఎక్కడో విహరిస్తుంది. ఏమిటి చదివావు? ఏదో చదివేసాం. అక్కడ పెట్టేసాం. ఎన్ని పనికిమాలిన విషయాలు ధారణలో ఉంటాయో. ఓ రిటైర్ అయిన వ్యక్తిని మీరు కదపండి, రిటైర్ అయి 15ఏళ్లు అయిపోతుంది. జాయిన్ అయిన తేదీ నుండి ఇంక్రిమెంట్ వచ్చిన తేదీ వరకు తప్పులేకుండా చెపుతాడు. శివానందలహరిలో శ్లోకం అడగండి. నిన్న ఉపన్యాసంలో మీరు ఏమి విన్నారని అడగండి. అబ్బా చాలా బాగుందండి అంటారు. ఏమి బాగుందండి, ఏవన్నా ఒకటి చెప్పండి అన్నామనుకోండి, ఇక మౌనం, నిశ్శబ్దం. గురు పరంపర అలా వెడుతూనే వుంటుంది. గురువుని–నిజంగా మనం చిత్తశుద్ధితో ఉద్ధరింపబడాలని కోరుకుంటే, మనలను ఉద్ధరించడానికి ప్రమాణ పూర్వకమైనటువంటి, ప్రామాణికమైనటువంటి విషయాన్ని బోధించగలిగినటువంటి గురువులు వాఙ్మయరూపంగా ఇప్పటికీ ఉన్నారు. ఆ వాఙ్మయాన్ని అంది పుచ్చుకొని చెబుతున్న గురువులూ ఉన్నారు. ఒకవేళ అందకపోతే అది నీ శ్రద్ధాలోపమే తప్ప గురువులను నిందించడానికి లేదు.

బురదలో ఉన్న తామరమొగ్గ విచ్చుకున్నప్పుడు నీ హృదయ పద్మం ఎందుకు విచ్చుకోలేదు. విచ్చుకోలేదంటే కారణం గురుకృప పడటానికి వీలు లేకుండా నీవు నీ హృదయపు తలుపులను మూసివేసావు. గురువైభవం ఒక చక్రవర్తి వైభవంలాంటిది కాదు. ఇదిగో ఫలానా చక్రవర్తి. "ఉత్తరమున హిమాలయ పర్వతముల నుండి దక్షిణమున కావేరి నది వరకు రాజ్యమును విస్తరింపచేసెను. రహదారి కిరుప్రక్కల చెట్లని నాటెను. సత్రములు కట్టించెను. బావులు త్రవ్వించెను. పండించిన పంటలో ఆరవ వంతు శిస్తుగా వసూలు చేసెను. అష్ట దిగ్గజములను పోషించెను" అని చెప్పేటటువంటి ప్రతిభకాదు గురువుది. తనస్థితినే తన బిడ్డలకు అందించగల ప్రతిభ గురువుది. కాబట్టి గురు వైభవం శిష్యుని యొక్క



పూనికతో కలిసి ఉంటుంది అని గమనించుకుందాం!

ఛత్రపతి శివాజీని కాపాడినవాడు సమర్ధ రామదాసులు, మహానుభావులు. శివాజీకి అంతటి ధర్మాన్ని బోధించి, సనాతన ధర్మం పట్ల అంతటి ప్రీతిని కలిగించిన వారు రామదాసుగారు. తన సైనికులు మహ్మదీయ స్త్రీలని చెరపట్టి తీసుకొస్తే అందరి పాదములకు నమస్కరించి, అమ్మా! మీరు వివాహితులు. మా జగజ్జనని స్వరూపులు. పొరపాటున మిమ్మల్ని తీసుకువచ్చారు. తల్లీ! మిమ్మల్ని పరదాలు కట్టిన పల్లకీలలో మళ్లీ మిమ్మల్ని మీ సామ్రాజ్యాలకు పంపించేస్తానని గోషాలతో పరదాలు కట్టిన పల్లకీలలో తనకు దొరికినటువంటి శత్రువుల భార్యలను త్రిప్పి పంపినటువంటి ఔదార్య బుద్ధి శివాజీయందు ప్రకాశించడానికి కారణం సమర్ధులు. మీరు ఇవాళ శ్రీశైలం వెళితే శ్రీశైలం దేవస్థానం ఒక గోపురం మీద అమ్మవారు శివాజీకి ఖడ్గం ప్రధానం చేస్తున్న మూర్తి ఉంటుంది. శివాజీ వెళ్లి అక్కడ తపస్సు చేస్తే రామదాసుగారి గురుత్వం, అమ్మవారు ప్రత్యక్షమై సనాతన ధర్మం నిలబెట్టడానికి కావలసినటువంటి ప్రతాప పౌరుషములతో కూడినటువంటి కరవాలాన్ని శివాజీకి బహూకరించింది. తమ తపస్సుతో ఈ దేశాన్ని రక్షించారు గురువులు. అటువంటి శివాజీ సింహాసనం మీద కూర్చుని ఉండగా సమర్ధులవారు కేవలం ఒక గోచి పెట్టుకుని వుండేవారు. ఒకరోజు సమర్ధులు లోపలికి వస్తున్నారు. శివాజీ సింహాసనం మీద నుండి లేచి, గురువుగారికి ఎదురు వెళ్లి, సాష్టాంగ నమస్కారం చేసి నిలబడితే, సమర్ధులు జోలె విప్పారు. గురువుగారు వచ్చి, జోలె పట్టారు. ఏది ఇవ్వాలా? అని ఆలోచించి, వెంటనే ఒక కాగితం తెప్పించి, తన పరిపాలనలో వున్నటువంటి సమస్త సామ్రాజ్యాన్ని దానపట్టా (Power of Attorney) వ్రాసి సంతకం చేసి, సమర్ధుల జోలెలో వేసి కింకరుణ్ని ప్రభో! మీరు సింహాసనాసీనులు కండి, మీ కింకరుడిగా మీ దగ్గర కూర్చుంటాను అన్నాడు. రామదాసుగారు ఆ పత్రం చూసి, నీ భక్తికి పొంగిపోతున్నానురా నాయనా! నాకెందుకీ ఈ రాజ్యం, నీవు సింహాసనం మీద కూర్చుని పరిపాలన చేయి, కాని నీవు నాకు దానమిచ్చిన దానికి నిన్ను నా ప్రతినిధిగా పెట్టాను. (Once we offer our body, mind, speech to Baba we should remember that they no longer belong to us. They become his sacred Prasad... SriBabuji) కనుక నీవు పరిపాలించిన రాజ్యంలో ప్రతి ఇంటిమీద, ప్రతి దుర్గంమీద ప్రతి కోటమీద, ప్రతి చెట్టుమీద, ప్రతి గుడిమీద కాషాయ పతకాలు ఎగరాలి. కాషాయాలు ఎగిరినంత దూరం నీరాజ్యం వున్నట్లు, అలా సనాతన ధర్మాన్ని గుర్తు చేసి, నిలబెట్టించారు శివాజీతో. ఎటువంటి పూనిక, ఎటువంటి గురువులు, ఎటువంటి శిష్యులు, ఒక్కసారి ఇలా నోరు విప్పి ఒక మాట అంటే చాలు, శిష్యుల్ని ఉద్ధరించేసారు. వుండవలసినది శ్రద్ధ, ఆ శ్రద్ధ అసలు గురువాక్యమునందు లేకపోతే గురువు ఎంత మాట్లాడినా, మేఘం వర్షిస్తుంది. కాని వర్షించిన వర్షము సముద్రంలో పడితే ఎవరికి ఉపయోగం! ఏమిటి ప్రయోజనం. అదే వర్షం ఎక్కడ పడాలో అక్కడ పడితే విత్తనం



మొలకెత్తుతుంది. గురువు మాట్లాడి, మన హృదయపీఠంలో సత్యవర్తనాన్ని, సన్మార్గ బీజాలను మొలకెత్తించేందుకు ప్రవచనం చేస్తుంటారు. కాని అందుకోవడానికి శిష్యుడు సిద్ధంగా లేకపోతే ఎంతమంది గురువులు ఎన్ని చెప్పినా ప్రయోజనం ఏముంటుంది? సద్గురుని మాటయందు, బాటయందు, భావమందు శ్రద్ధ ఉండాలి. ఆచరించేందుకు మన అడుగులు ఆ క్రమంలోనే సాగాలి... మనం గమ్యం చేరాలి.

## అనుగ్రహ సునామీ

నా పేరు బి.శ్రీనివాసులు రెడ్డి. వృత్తిరీత్యా డాక్టరును. నివాసం ఒంగోలు. నా జీవితంలో ఒక మరపురాని అనుభవాన్ని గురుకృప ద్వారా మీ అందరికీ పంచుకుంటాను. అది 2004, డిసెంబరు 26వ తేది. పూజ్యశ్రీగురుదేవులు చెన్నైనగరం నుండి మహాబలిపురం పోయే దారిలో సముద్రం ఒడ్డున ఉత్తండి అనే ప్రదేశంలో ఉన్నారు. డిసెంబరు 25వ తేది క్రిస్మస్ నాటి రాత్రి గురువుగారు చేసిన సత్సంగంలో పాల్గొన్నాను. 26వ తేది ఉదయం బయట వర్షం వుండడం వలన 8 గం॥ల ప్రాంతంలో సముద్రానికి పోయి స్నానం చేద్దామని బయలుదేరి కాసేపు సముద్ర తీరంలో అలలు గాలికి నా శరీరానికి తగులుతూ పోతున్నాయి. అలలు అంతకంతకూ పెరుగుతూ వుంటే సముద్రం నుండి గట్టుపైకి పోతూ పోతూ ఒక పెద్ద గోడ అడ్డుగా వున్నందున ఎటూ పోలేక, ఆగిపోయి అక్కడే చిన్న ఇసుక తిన్నె వుంటే దానిపై కూర్చుండిపోయాను. సముద్రం నుండి అలలు ఉధృతంగా వచ్చినా నా కన్నా ఎత్తులో లేచి వెనుతిరిగి పోతున్నాయి. సముద్రమంతా అల్లకల్లోలంగా ఉంది. అపుడు గుర్తుకు వచ్చింది ఆరోజు పౌర్ణమి అని. అందుకనే సముద్రంలో అలలు అంత ఉధృతంగా ఎగిసెగిసి పడుతున్నాయని అనుకున్నాను. ఇటువంటి అవకాశం రాదు కదా అని ఆ కల్లోల సముద్రాన్ని, ఎగిసి పడుతున్న అలలను చూస్తూ ఆనందిస్తున్నాను. అలలు ఎంత ఉధృతంగా వచ్చినా నన్ను మాత్రం తాకలేదు. దాదాపు 10 ని॥లు అలా వుంది సముద్రం. ఒక కిలో మీటరు లోపలికి పోయి, వట్టి నేల మాత్రం కనిపించింది. నేను దిగి నడుచుకుంటూ కొద్ది దూరం పోయాను. చేపలు మాత్రం ఎగిరెగిరి పడుతున్నాయి నేల మీద. ఎంత తీవ్రంగా సముద్రం లోపలికి పోయిందో, అంత తీవ్రంగా వెలుపలికి వచ్చింది. నేను త్వరత్వరగా వెనుతిరిగి గట్టుమీదకి వచ్చేసాను. అప్పుడు జనం విపరీతంగా వచ్చి పదే పదే వారి భాషలో ఆదుర్దాగా ఏదో మాట్లాడారు. నాకు ఒక్క ముక్క అర్థం కాలేదు. భావాన్ని బట్టి అర్థం అయింది. ఏమంటే నీవు ఒక్కడివే ఇక్కడ ఎలా వున్నావు అని. నాకు ఏమీ చెప్పడానికి భాష రాక నేను సముద్రాన్ని చూసుకుంటూ మా గెస్ట్‌హౌస్‌కి పోతుంటే దారిలో నడుములోతు నీళ్లు, బోట్లు, వలలు కొట్టుకొని గెస్ట్‌హౌస్ వద్దకు వచ్చి పడి ఉన్నాయి. నేను వచ్చే దారిలోని గెస్ట్‌హౌస్‌లోనికి నీళ్లు వచ్చాయి. చెట్లు పడిపోయాయి.



కార్లు నీళ్లమీద తేలుతున్నాయి. చాలా భీభత్సంగా వుంది పరిస్థితి. అప్పటికి నాకు అర్థం అయింది సముద్రం నా వెనుక అర కిలోమీటరు వరకు ముందుకు పోయి మరల వెనుకకు వచ్చి కిలోమీటరు లోపలికి పోయిందని. ఇంత జరిగినా నాకేమీ కానందకు చాలా ఆశ్చర్యం వేసింది. ఇంతలో గురుబంధువులందరూ నేను ఏమైపోయానా అని కంగారు పడుతున్నారు. నేను క్షేమంగా వున్నానని సంతోషంతో మీరు ఎక్కడ వున్నారు అని అడగగా, నాకు జరిగిన అనుభవం చెపితే వాళ్లు ఎంతో ఆశ్చర్య పడి ఇలా క్షేమంగా తిరిగి రావడం నిజంగా బాబా అనుగ్రహం అన్నారు. అప్పటికి గాని నాకు తెలియదు దానిని సునామీ అంటారని, ప్రపంచంలో చాలా దేశాలలో ఒకే సమయంలో ఎంతో భీభత్సం సృష్టించి ఎందరో ప్రాణాలను తీసిందని. ఆ అనుభవాన్ని తలచుకుంటే ఏదో తెలియని అనుభూతిగా ఉంటుంది నాకు. ఈ విషయం తెలిసి గురువుగారు అన్నారట " డాక్టరు గారికి ఏమీ అర్థం కావడం లేదు బాబా ఎంతటి గండాన్నుంచి వారిని రక్షించారు అని". ఈ సందర్భంలోనే కాక ఇంకా పలు సందర్భాలలో నాకు ఏమీ కాకుండా నన్ను కాపాడుతూ రక్షిస్తున్న బాబా, బాబూజీలకు సర్వదా కృతజ్ఞుడను. నాకు పునర్జన్మను ప్రసాదించిన వారికి నా సాష్టాంగ నమస్కారములు సమర్పిస్తూ ముగిస్తున్నాను.

*– బి.శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు*

## తగిన రీతిన వర్తించు

సాధకుడయినవాడు తన దినచర్యను తగిన పద్ధతిలో తీర్చిదిద్దుకోవాలి. ఈ దిద్దుకోవడం అనేది ఆహార విహారాదులతో ప్రారంభమయి, నిద్రాదుల వరకు కూడా కొనసాగాలి.

దినచర్యను దిద్దుకోనివాడు దేవుని తోడి అనుసంధానాన్ని కోరడం అత్యాశే కాగలదు. దిన చర్యను దిద్దుకుంటున్న వానికి దైవమే తానుగా దగ్గర కాగలదు. ఉదా: రాగి కాగుగా వున్నపుడు నీళ్లను మాత్రమే కాచిపెట్టగలదు. అది తీగగా సాగదీయబడి, విద్యుత్ ప్రసరణకు నోచుకున్నపుడు మహాకార్యములే సాధించి పెట్టగలదు. ఇలా కాగు స్థితి నుండి తీగవంటి స్థితి వరకు మనల్ని మనం మలచుకోవలసి ఉంది. అప్పుడు దైవశక్తి అను విద్యుత్ ప్రసరణ మన నుండి సాగుతూ విశ్వశ్రేయస్సును సాధించగలదు. ఇది ప్రసారమే కాని ప్రచారం కాదు. ఇది సర్వోన్నతమైన ప్రసార కార్యం. సాధన అనగానే భయపడాల్సిన పనిలేదు. తెలుసుకోవలసిన అవసరం మాత్రం ఉన్నది. లేచింది మొదలు ఏదో ఒక పనిని చేస్తూ ఉంటాం. అయితే ఆ పనులను తోచినట్లు చేస్తూ ఉంటాం. చేతనయినట్లు చేస్తుంటాం. ఇంతకన్నా ఏం చేయగలములే అనుకుంటాం. ఎవరయినా ఇంతకన్నా ఏం చేస్తారు అని సమర్ధించుకుంటూ ఉంటాం. ఇది మాత్రం మనం మానాలి. ఒక పనిని నిన్న చేసినట్లే ఇవాళ కూడా చేస్తే అర్థమేమిటి?



మొక్కలాంటిది నిన్నటి కన్నా ఇవాల్టికి కొంచెం పెరుగుతుంది. మరి మనలో అలాంటి పెరుగుదల కనబడనక్కరలేదా? మొక్కపాటి చేయమా మనం? మొక్కపాటి చేయనపుడు దేవునికి ఎన్ని మొక్కులు మొక్కి ఏం లాభం?

ఇంతకూ చేయవలసింది ఏమీ లేదు. చేస్తున్న పనుల మీద కాస్తంత శ్రద్ధ పెట్టాలి. సర్వ సాధారణంగా పనులను మనం అలవాటు చొప్పున చేసేస్తుంటాం. నిర్లక్ష్యంగా, యాంత్రికంగా చేసేస్తుంటాం. ఇలా చేసి అలసి పడిపోతూ ఉంటాం. ఈ అవలక్షణాలు లేకపోతే అలసట లేదు. పనిని చేయవలసిన విధంగా చేస్తున్నపుడు కావలసిన శక్తి మీకు పని నుండే అందుతూ ఉంటుంది.

ఇలా చిన్న చిన్న విషయాలను సర్ధుకుంటూ వెళితే పెద్ద పెద్ద అంశాలు వాటికవిగా అలవడతాయి. ఆహార స్వీకరణను భగవానుని యజ్ఞ శేష స్వీకరణగా పరిగణించండి. అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్న మాట మరువకండి, వృధా చేయకండి, ఆహారాన్ని నిందించకండి. ఆహార స్వీకరణ సమయం ధ్యాన సమయం వంటిదని గమనించండి. ఆహార స్వీకరణావధానం ముచ్చటగా వుండేట్లు అభ్యాసం చేయండి. మీరున్న శరీర మానసిక స్థితులను బట్టి ఏ విధమైన ఆహారం ఎంతవరకు అవసరమో ఆ ఆహారాన్ని అంతవరకే స్వీకరించండి. మొహమాట పడకండి. తోటివారు బలవంతం చేసినా, నాజూకుగా తప్పించుకోండి. ఎదుటివారి విషయంలో కూడా ఇలాగే ప్రవర్తించండి. వారికి తగిన విధంగా వారికి ఆహారాన్ని అందించి, వారిని తృప్తి పరచండి. మనవలన వారు ఏ ఇబ్బంది పడకుండా చూడండి. అతివృష్టి, అనావృష్టి రెండూ చివరికి దుఃఖాన్నే కలిగిస్తాయి. అతిగా తినేవానికి, బొత్తిగా తిండి తినని వానికి ధ్యానయోగం సిద్ధించదు – గీత. యుక్తాహార విహారస్య–సరి అయిన ఆహారము, నడత కలిగిన వానికి సిద్ధించును. వాతభుక్త – మనం తినే ఆహారం శరీరానికి మేలు చేసేదిగా ఉండాలి. మితభుక్త– హితమైన ఆహారాన్నైనా మితంగానే తినాలి. ఏ అన్నం తన కొలతకు తగినదో ఆ అన్నము కాపాడుతున్నది దానికంటే అధికమైనది చెరుపు చేయుచున్నది. స్వల్పంగా తిను. ఒకటి రెండు పదార్ధాలతో తృప్తిపడు. రుచులకు పోవద్దు. శ్రీసాయిబాబా అన్న ఉపదేశాన్ని పరిప్రశ్నాత్మకంగా యోచిస్తే, యోచించి, ఆచరిస్తే (సద్విచారణం) ఇంకా ఎన్నో విషయాలు అవగతమవుతాయి. ఋతభుక్త – మంచి శ్రేష్ఠమైన ఆహారాన్ని తినాలి. అది న్యాయార్జితమై ఉండాలి. ఆహార విషయంలో ఇలాంటి శ్రద్ధ పెట్టండి.

ఇక విహార విషయానికొద్దాం. విహారం ఎవరికి? పని చేయడంలో అలసిన మనసుకు, ఇంద్రియాలకు, వాటికి కావలసిన ఉల్లాసాన్ని అందించగలగాలి. అప్పుడు అవి శ్రమనుండి కోలుకుంటాయి. ఎలాంటి విహారం అన్నది మన పరిణామంపై ఆధార పడి ఉంటుంది. మనందరం సమకాలీకులమే అయినా, ఒకే భూమిపైన తిరుగాడుతున్నా ఎవరి అభిలాష వారిది. విహారాలు



అనేసరికి ఎవరి దృక్పధాలు వారివి. ఇలా ఉండడం సహజం. వైవిధ్యం సృష్టియొక్క లక్షణం. నీ పరిణామాన్ని బట్టి, నీలో కలుగుతున్న అభిలాష, విహారాలను గూర్చిన ఆలోచనలను క్రమబద్ధం చేయి. వాటివలన నీకు మేలు జరగాలే, కాని కీడు జరుగరాదు. నీ విహారం వలన వ్యక్తిగతంగాగాని, కుటుంబపరంగాగాని, సమాజపరంగాగాని, సృష్టిపరంగాగాని, ఎలాంటి నష్టము ఒరగకుండా చూసుకోవడమే క్రమబద్ధీకరణ, నియమపాలన, ధర్మబద్ధత మేలు కలిగించే విహారాలన్నీ యుక్తమైనవి.

"ఇంత విశాల విశ్వమున్నది, దీనిని నేను సృష్టించింది ఎవరికోసం? మీ విహారం కోసమే, మీ ఆనందం కోసమే! ఈ వైవిధ్యం, ఈ వైభవం ఇదంతా మీ కోసమే! అయితే దెబ్బ తినకుండా అనుభవించడం నేర్చుకోండి! అదొక్కటే నేను మిమ్మల్ని కోరేది" అంటాడు భగవంతుడు.

ఒక సూర్యోదయం వున్నట్లు మరో సూర్యోదయం వుండదు. ఒక చంద్రోదయం వున్నట్లు మరో చంద్రోదయం వుండదు. ఒక తారక వున్నట్లు మరో తారక వుండదు. ఒక మొక్క వున్నట్లు మరో మొక్క, ఒక కొండ వున్నట్లు మరో కొండ,  ఒక మనిషి వున్నట్లు మరో మనిషి వుండదు. ఇంత సృష్టి ఎవరి కోసం? మీ కోసం, మీరు మురియడం కోసం. విహరిస్తున్న క్షణాలలో ఈ విశాల విశ్వంలోని విహారాల వైభవం అంతా భగవంతుడిదే అని గ్రహింపు, గుర్తింపు వుండాలి. నేను గుర్తున్నంత వరకు మీరు జారిపోరు, నన్ను మరచిన వేళ మీకు దారిలేదు. ఇది విహార రహస్యం. ఇక విహరించండి. యుక్తమైన రీతిలో – ముందుతరాలకు అందించే ప్రయత్నంలో, తగిన యుక్తమైన రీతిలో వర్తించండి.

– *పార్థసారథి ప్రవచనాల నుండి సేకరణ*

## సాయి క్షేమ–సద్గురు ప్రేమ

పూజ్య గురుదేవుల పాద పద్మములకు నా సాష్టాంగ నమస్కారములు. నా పేరు వెంకటేష్. మాది నెల్లూరు దగ్గర ఒక గ్రామం. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నాము. నేను మొదట గురుదేవుల దర్శనం చేసుకున్నది 2002 విజయదశమికి శిరిడీలో. ఆ రోజు నుండి నా జీవితంలో ఎంతో మార్పు వచ్చింది. ఒక్కొక్క సందర్భంలో ఏదైనా పెద్ద సమస్య వచ్చినపుడు దానికి కావలసిన మానసిక ధైర్యాన్ని, తోడ్పాటును గురుదేవులే నాకు దయతో అందిస్తున్నారు. నాకు గురుదేవుల దయతో 2007 గురుపూర్ణిమకు వారి పాదాల చెంత నా వివాహం జరిగింది. నా భార్య పేరు స్రవంతి. మాకు ఇప్పుడు ఒక పాప. మా పాప కడుపులో ఉన్నపుడే గురువుగారు నా భార్యకు కలలో కనిపించి, 'నీకేం భయంలేదు, నేను చూసుకుంటాను' అని అభయం ఇచ్చారు. ఆ తరువాత డెలివరీకి ముందు బేబీ కదలికలు



ఆగిపోయాయి. దాదాపు ఒకరోజు మొత్తం కదలికలు లేవు. ఆరోజు సాయంత్రం డాక్టర్ వద్దకు వెళ్లగా పరీక్ష చేసి, వెంటనే ఆపరేషన్ చేయాలని చెప్పి, అప్పటికపుడే ఆపరేషన్ చేసేసారు. ఆరోజు గురువారం.

ఆ తరువాత డాక్టర్ ఇలా చెప్పారు "మీరు చాలా అదృష్టవంతులండీ! పాప మెడ చుట్టూ ప్రేగులు చుట్టుకొని వున్నాయి, అందుకే పాప కదలిక లేక అలాగే ఉండిపోయింది. ఇక ఏ మాత్రం ఆలస్యం చేసి వున్నా పరిస్థితి మరోలా వుండేది అని చెప్పింది. నాకు అపుడు అనిపించింది. అంతకు ముందు గురుదేవులు కలలో కనిపించి, నీకేం భయంలేదు, నేను చూసుకుంటాను అని ఇందుకే అన్నారని. రాబోయే ప్రమాదాన్ని గురించి, ముందుగానే సూచిస్తూ, అయినా భయపడనవసరం లేదు, నేను చూసుకుంటాను అనే బాబా లీలలు గుర్తుకొస్తున్నాయి. పాప పుట్టినప్పటి నుండి గురుదేవులను పాపకు పేరు పెట్టమని వేడుకుంటున్నాము. గురువుగారు నెమ్మదిగా తలఊపి, పాపను ఆశీర్వదించారు. అలాగే 2009 గురుపూర్ణిమకు కూడా పేరు గురించి అడిగాము. అపుడు కూడా నెమ్మదిగా తలఊపి ఆశీర్వదించారు. ఆ తరువాత మా వివరాలు వ్రాసి, బుక్‌స్టాల్‌లో ఇచ్చాము. కానీ పేరు రాలేదు. ఆ సందర్భంలోనే గురుదేవులు కొందరికి పేర్లు పెట్టారని తెలిసి చాలా బాధపడ్డాము. అందరికీ పేర్లు పెడుతున్నారు. మాకు మాత్రం ఎందుకు పెట్టడం లేదు అని. కొందరేమో గురువుగారు ఒక సంవత్సరం నుండి పేర్లు పెట్టడం లేదు అని చెప్పారు. అలా బాధపడుతున్న క్రమంలో ఒక రోజు గురువుగారు నాకు కలలో కనిపించి, పేరుకు ఎందుకంత తొందర! మీ కుటుంబంతో కలసి తిరువణ్ణామలై రండి. అక్కడ మంచి పేరు పెడతాను అని చెప్పారు. నాకు ఎంతో ఆనందం వేసింది. నెల రోజుల తరువాత గురువుగారు తిరువణ్ణామలై వచ్చారు. అపుడు ఎంతో ఆశతో వెళ్లాము. అప్పుడు కూడా గురుదేవులు పాపను తాకి దీవించారు. పేరు మాత్రం పెట్టలేదు. అక్కడ గడిపే వ్యవధి లేక తిరిగి ఇంటికి వచ్చేసాము. తిరిగి మళ్లీ 2010 జనవరిలో శిరిడీ వెళ్లాము. అపుడు గురుదేవులు ఎంతో ప్రసన్నంగా మావైపు చూసారు. అపుడు గురువుగారు పాప బుగ్గమీద నెమ్మదిగా తాకారు. ఎంత నెమ్మదిగా తాకారు అంటే అందులో ఎంత మాధుర్యం ఉందో నేనైతే చెప్పలేను. ఆ తరువాత రోజు గురుదేవుల దర్శనం ఉండదని ప్రకటించడం చాలా బాధనిపించింది. అన్నప్రాసన, వివాహాలు, నామకరణాలు ఉండవు అని చెప్పేసరికి ఇక మా ఆశలన్నీ నీరుగారి పోయాయి. అపుడు గురుదేవులను నేనొక్కటే కోరుకున్నాను. మాకు ఇవేవీ అవసరం లేదు. మాకు మీ దర్శనం లభిస్తే చాలు. తృప్తి పడతాము అని. అలా బాధాకర పరిస్థితులలో తిరిగి ఇల్లు చేరాము. అలా బాధపడుతూ వున్నపుడు ఒక సంఘటన జరిగింది. ఒక రోజు ఆఫీసు నుండి ఇంటికి వస్తూ మాకు సంబంధించిన ఒక ఇనుపముక్కను తీసుకు వచ్చి ఇంట్లో ర్యాక్‌లో ఉంచాను. మరుసటి రోజు నేను ఆఫీసుకు వెళ్లడానికి తయారవుతున్నాను. ఇంతలో పెద్ద శబ్ధం అయి, పాప అరచి ఏడుస్తుంది. మేము పరిగెత్తుకుంటూ, హాలులోనికి



వచ్చి, చూసేసరికి, అపుడు కనిపించిన దృశ్యం, ఆ ర్యాక్‌లో ఉంచిన ఇనుపముక్కను పాప లాగే సరికి అది వచ్చి కాలి మీద పడింది. నేను వచ్చి చూసేసరికి ఆ ఇనుపముక్క కాలిమీద పడిఉంది. వెంటనే అది తీసి, పాపను ప్రక్కకు లాగేశాను. చూస్తే పాపకు చిన్న దెబ్బ కూడా తగల్లేదు. విచిత్రమేమిటంటే ఆ ఇనుపముక్క 'యు' **(U)** ఆకారంలో ఉండి చాలా పదునుగా ఉంది. అది క్రింద పడినపుడు సరిగ్గా ఆ 'యు' షేప్ కాలి మీద పడింది. అది కొంచెం అటూ, ఇటూ అయినా కాలు అక్కడికక్కడే చితికిపోయి ఉండేది. ఎందుకంటే అది బరువైనది మరియు పదునుగా ఉంది. అలా పాపకు ఎటువంటి హాని జరుగకుండా గురుదేవులు కాపాడారు. అపుడే బాబా-గురుదేవులకు కృతజ్ఞతలు తెలుపుకున్నాము.

తరువాత రోజు ఉదయం ఆఫీసుకు వెళ్లాను. బాబాకు దీపం పెట్టి, నమస్కారం చేసుకుని కూర్చున్నాను. అపుడే ఫోన్ మ్రోగింది. తీస్తే చెన్నై నుండి గురువుగారి ఇంటివద్ద నుండి అని చెప్పారు. మీరు మీ పాపకు పేరు అడిగారు కదా! గురువుగారు మీ పాపకు "సాయి క్షేమ" అని పేరు పెట్టారని చెప్పారు. మనసులోనే గురువుగారికి, బాబాకు నమస్కారములు తెలుపుకున్నాను. ఆ క్షణంలో నా ఆనందానికి అవధులు లేవు. గురువుగారు ఇన్ని రోజులు పేరు ఎందుకు పెట్టలేదు, ఇపుడే ఎందుకు పెట్టారు అనే విషయం నాకపుడు అర్థం అయింది. సరిగ్గా నిన్న జరిగిన సంఘటన, ఆ ప్రమాదం నుండి పాపను కాపాడి, దానికి గుర్తుగా ఇవాళ పాపకు పేరు పెట్టడం, మీ అందరి యోగక్షేమాలు నేను చూసుకుంటాను అని చెప్పినట్లు అనిపించింది. ఆ పేరు విన్న తరువాత నిన్న ఆ సంఘటన జరిగినపుడే గురువుగారు మా గురించి ఆలోచిస్తున్నారని, మా పాపను ఆ ప్రమాదం నుండి కాపాడి, అపుడే "సాయిక్షేమ" అని పేరు పెట్టి ఉంటారు అని అర్థమైంది.

మా పాప మొదట మాట్లాడిన మాట బా...బా... అని. 2009 లో శిరిడీ వెళ్లినపుడు బా...బా.. అని చేతులు ఆడిస్తూ ఉండేది. అలా గురుదేవులు మాకు ప్రసాదించిన ఈ పాపను అడుగడుగునా కాపాడుతూ, క్షేమంగా ఉంచుతూ, మమ్ములనందరినీ కూడా క్షేమంగా చూసుకుంటున్నారు. గురుదేవుల లీలలు ఎన్నని, ఏమని వ్రాయగలను, ఇలా వ్రాస్తూ పోతే, 'గురుకృప' నిండిపోతుంది. గురుదేవుల అనుగ్రహంతో అవకాశం వచ్చినపుడు మళ్లీ నా అనుభవాలు చెప్పుకుంటాను. అన్నిటికి మించి, గురుదేవులు మా మీద చూపే ప్రేమ, కరుణ, అంతా ఇంతా అని చెప్పలేము. ఓ గురుదేవా! మేము ఎల్లప్పుడూ మీ పాదాలనే పట్టుకొని, మీ దగ్గర సంతోషంగా, మీరు చూపిన బాటలో ముందుకు వెళ్లాలని కోరుకుంటూ...

*- వెంకటేష్, స్రవంతి, సాయిక్షేమ*

**ఓ మహోన్నత సత్యాన్ని ఉపదేశించే గురువూ అద్భుతమైనవాడుగా ఉండాలి; శిష్యుడూ అద్భుతమైన వ్యక్తిగా ఉండాలి - కఠోపనిషత్తు 1.2.7**



# సంత్ ఏకనాథుడు

చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోయిన ఏకనాథుని తాత, నాన్నమ్మలే పెంచారు. తాత చక్రపాణి ఏకనాథుని సంస్కారవంతునిగా చేయడానికి నడుం కట్టారు. అతడు ప్రేమతో మంచి కథలు చెపుతూ, సంస్కార బీజాల్ని నాటాడు. "బాబూ, జీవితాన్ని చక్కగా మలచుకోవాలి, భగవంతుడు మెచ్చునట్లు నడచుకోవాలి" అని చెప్పేవారు. నాయనమ్మ వాణ్ని తన వద్ద కూర్చొ బెట్టుకొని "రామకృష్ణ హరే, వాసుదేవ హరే" కీర్తన చేయించేది. అలా ఏకనాథుడు వచ్చీరాని మాటలతో నాయనమ్మతోపాటు భజన చేసేవాడు. ఆమె వాడిని చూసి తన బిడ్డను తలచుకొని బాధపడుతుంటే ఆ పిల్లవాడు ఇలా అంటాడు "నాయనమ్మా! ఏడ్చేవాడ్ని దేవుడు ప్రేమించడని తాతయ్య అంటాడు. నవ్వడానికే సంసారాన్ని సృష్టించాడు దేవుడు. ఏడ్వడానికి కాదు" అని. ఏకనాథుని జ్ఞానపూర్వకమైన మాటలు విని నాయనమ్మ తన అశ్రువుల్ని తుడుచుకుంటుంది.

"మాతృదేవోభవ" అంటూ నాయనమ్మ చెబుతుంటే "నాకైతే తల్లి లేదుగా, మరి నేనెవరికి నమస్కరించాలి?" అని ప్రశ్నించిన ఏకనాథునితో "బాబూ! మన సంస్కృతియే మన తల్లి. ఆ తల్లికి నమస్కరించాలి. విస్మరించరాదు" అని వివరిస్తున్న నాయనమ్మ.

"పితృదేవోభవ" అంటూ తాతయ్య చెబుతుంటే, మళ్లీ అదే ప్రశ్న. "నాన్న నాకు లేడు, ఎలా నమస్కరించాలి?" "బాబూ! భగవంతుడే అందరి తండ్రి, అతనికి నమస్కరించాలి. అతన్ని మరువరాదు" అని తాతగారి సమాధానం. ఇలా తాతయ్య, నాయనమ్మ అతనిలో సంస్కార బీజాల్ని నాటుతున్నారు. జనార్ధన స్వామి (దేవగిరి మండలాధీశుడు, మొఘలు చక్రవర్తి సేనాధిపతి) వద్ద కేగి వార్ని గురువుగా స్వీకరించమన్న శంకరుని ఆదేశాన్ననుసరించి, ఇంటిని వదలి జనార్ధనస్వామి కొలువులో ప్రభుత్వ గణాంకశాఖను నిర్వహిస్తుంటాడు ఏకనాథుడు. ఏకనాథుని వ్యవహార కుశలతత్వాన్ని, ఏకనిష్టత్వాన్ని, ప్రతిభను చూసి గణాంకశాఖ నిర్వహణను అప్పగించారు. లెక్కలలో వున్న అర్ధరూపాయి తేడాను కనుక్కోవడానికి రాత్రంతయు మేల్కొన్న ఏకనాథుని శ్రద్ధ, భక్తిని చూసి ఇలాగే రేయింబవళ్లు జాగ్రత్తగా వుంటూ నీ జీవితంలో ఇసుమంతయూ పొరపాటు రానీయకు. నీ అకుంఠిత భక్తి దైవసాక్షాత్కారానికి తోడుపడుతుంది. ప్రస్తుత కాలములో జనులు భగవంతుని, మన సంస్కృతిని విస్మరించిన కారణంగా వారు దీనులుగా, హీనులుగా, నిస్సహాయులుగా, నిస్తేజులుగా, పశుతుల్యులుగా జీవిస్తున్నారు. భగవంతుని, మన సంస్కృతిని విస్మరించక దివ్యమైన, తేజోవంతమైన జీవితాన్ని గడపాలి అని ఉపదేశించారు జనార్ధనస్వామి. మానవ సమాజం అంధభక్తిని, మూఢభక్తిని అనుసరిస్తే భక్తి నుండి – తేజస్సు, జ్ఞానం అంతరిస్తాయి. అలాంటి పరిస్థితులలో మహాపురుషులు ఉద్భవించి, నిజమైన, జ్ఞానమయమైన భక్తిని పునర్జీవింప చేస్తారు. స్వాధ్యాయం చేసి జీవితాన్ని సవ్యంగా గడిపే విధానాన్ని గ్రహించి, అర్ధవంతంగా జీవితాన్ని గడపసాగాడు ఏకనాథుడు.

– *సత్య సంకలనాలు*



# మీ చూపే తొలిమెట్టు

పరమపూజ్య సద్గురువు శ్రీసాయినాధునికి, నడయాడే సాయినాధుడైన మన గురువుగారికి నా నమస్సులు. వారు నాకు అందించిన అనుగ్రహ విశేషాలను మీ అందరితో పంచుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఆ భాగ్యాన్ని కలిగించిన మన గురువుగారికి, గురుకృప పత్రికను గురువుగారి కృపతో లాలించి, నడిపిస్తున్న మన గురుబంధువులకు ఇది చదువుతున్న మీకు నా కృతజ్ఞతలు. మన గురువుగారి గురించి నాకు మొదట తెలియడం ఎలా జరిగిందో ముందు వివరిస్తాను. వైజాగ్‌లో ఉంటున్న మా అమ్మగారికి స్టేజి4 క్యాన్సర్ ఉన్నట్లు మాకు తెలిసింది. అది చాలా అవయవాలకు ప్రాకినట్లు తెలిసింది. అది నయంకాని పరిస్థితి. మందులు స్వల్పంగా పనిచేస్తాయి. ఆపరేషన్ అవకాశం లేదు. ఇంకొన్ని నెలలేనని డాక్టర్లు చెప్పారు.

అమ్మకు కొంత బాగుండడం కోసం చికిత్స చేయిద్దామని నాతో బెంగుళూరు తీసుకు వెళ్తానన్నాను. ఆమెకు ఆధ్యాత్మికత మీద, బాబా మీద ఎన్నో ఏళ్ల నుండి అవగాహన, భక్తి ఉన్నాయి. బెంగుళూరు వెళ్తూ, కొన్ని ఆధ్యాత్మిక పుస్తకాలు తీసుకొని వెళ్లాము. 'శ్రీసాయి భక్తి సాధన రహస్యం', 'శ్రీసాయి గురుచరిత్ర' అందులో ఉన్నాయని గమనించలేదు. అమ్మ ఈ పుస్తకాలను కొన్ని ఏళ్ల క్రితం కొన్నది గాని చదువలేదు. బెంగుళూరులో నేను అనుకోకుండా ఈ పుస్తకాలను చదవడం మొదలుపెట్టాను. మొదట గురువుగారి ఫొటో, పేరు చూచి ఎవరో పేరున్న సాయిభక్తుడు కాబోలు అనుకున్నాను. అమ్మకూడా తిరుపతిలో ఉన్నపుడు బాబా ఆలయంలో ఆయన ఫొటో చూసానని, అంతకు మించి తెలియదు అని అంది. ఆ పుస్తకాలలో ప్రకటమైన మహోన్నతభావాలు, కూలంకషమైన పరిశోధన చూసి, గురువుగారిని దర్శించుకోవాలనిపించింది. మార్చి 2009లో శిరిడీ వెళ్తూ గురువుగారు అక్కడే ఉంటారు, దర్శించవచ్చు అనుకున్నాము. అక్కడ తెలిసింది గురువుగారు చెన్నైలో ఉంటారని. శిరిడీ కొన్ని సమయాలలో వస్తారని. చాలా నిరాశపడ్డాము. గురువుగారికి ఉత్తరం రాసి పెట్టాను. అమ్మ గురించి వ్రాసి, ఆయన శీఘ్రదర్శనం కోరాను. బెంగళూరు తిరిగి వచ్చి చికిత్స మొదలుపెట్టాము. జూన్ వరకు చేసిన చికిత్స అమ్మకు ఎంతో దోహదం చేసింది. ఆ తరువాత చేసిన స్కానింగ్‌లో తేలినదేమంటే అమ్మకు మెదడులో ఉన్న తీవ్రమైన క్యాన్సర్ కణితి ఇపుడు మళ్లీ కనిపించలేదు. వేరే అవయవాలలో ఉన్నాయి ఇంకా. మెదడులో కణాలు అలానే ఉండి ఉంటే, ఆమె ఎంతో బాధకు, మనస్తాపానికి గురి అయ్యేది. అవి పోవడం వలన చివరి మాసాలలో ఆమె చక్కగా సాధన చేసుకొని, ఎన్నో మహాత్ముల చరిత్రలు చదివి, ఎందరినో దర్శించి, తృప్తిగా బాబా-గురువుగారి నామాలు స్మరిస్తూ, మార్చి 2010లో వారిని చేరుకుంది.



మార్చి-జూన్ 2009 మధ్యలో నేను, అమ్మ, నాన్న - తిరుపతి, శిరిడీ, శ్రీశైలం, భద్రాచలం మొదలైన పుణ్యక్షేత్రాలు, సాయిమాస్టారు సమాధి, ఇతర మహాత్ముల సమాధులు, ఆశ్రమాలు దర్శించాము. ఇదంతా చేయడానికి గురువుగారు, బాబా-అమ్మకు ఆశ్చర్యకరమైన శక్తిని ప్రసాదించారు. జూలై 2009లో గురు పూర్ణిమకు నేను ఒక్కడినే అనుకోకుండా శిరిడీ రావడం, గురువుగారి దర్శనం చేసుకోవడం జరిగింది.

***ఆ కరుణా మూర్తిని చూస్తూనే ఆనంద భాష్పాలు ఎడతెరిపి లేకుండా ధారాళంగా వచ్చాయి. జన్మ ధన్యమైనదనిపించింది. ఇది వరకు ఫొటోలలో కనిపించిన గంభీరత్వానికి వెనుక అవధిలేని ప్రేమతత్వం కనిపించింది. మనందరికోసమే ఆ మహనీయుడు ఎల్లవేళలా పరితపిస్తూ, తపశ్శక్తిని ధారపోస్తున్నారని చాలా స్పష్టంగా అర్ధమయ్యింది. గురువుగారికి, నాకు ఏదో వర్ణించలేని బంధం ఉందనిపించింది.***

జూలై-సెప్టెంబరు 2009 మధ్యలో నేను సాయిమాస్టారు వ్రాసిన మహాత్ముల చరిత్రలను ఎన్నో చదివి, మరల కొందరి దర్శనాలు చేసుకున్నాను. సెప్టెంబరులో సాయిమాస్టారి చరిత్రనే చదవడం మొదలుపెట్టాను. ఆ పుస్తకం చదవడం పూర్తి అయిన రోజు గురువుగారు నాకొక స్వప్న దర్శనమిచ్చారు. అదే మొదటి స్వప్న దర్శనం. ఒక పాతపెంకుటి ఇల్లు కనిపిస్తుంది. నేను, నాన్న ఒక ప్రక్కగా, అమ్మ ఇంకొక ప్రక్కగా అరుగుమీద నుంచొని గురువుగారికి నమస్కారం చేస్తున్నాము. ముందు గురువుగారు అమ్మ వద్దకు వెళ్ళి ఏదో మాట్లాడారు. మరల మా ప్రక్కకు వచ్చారు. అప్పుడు ఈ సంభాషణ జరిగింది. గురువుగారు "మీరెవరో నాకు తెలియదు" అన్నారు, "మేము ఇంతకు ముందు వచ్చామండి" అని బదులిచ్చాను. "అవును మార్చిలో వచ్చారు కదా!" అన్నారు గురువుగారు. అలా అంటూ అక్కడే వున్న కొళాయిలో నుండి నీరు తన కుడి చేతిలో పట్టుకొని గురువుగారు నీళ్లు త్రాగారు. త్రాగుతున్నపుడు వారి చేతి వెంట నీరు కారి మోచేతి దగ్గర నుండి క్రింద పడబోతున్నది. నేను అరుగుమీద ఉండడం వలన ఆ కారుతున్న నీటిని నా చేతిలో పట్టుకొని వెంటనే నేను త్రాగేసాను. అదిచూసి గురువుగారు ఆశ్చర్యంగా అన్నట్లు 'ఆ' అని అన్నారు. అప్పటితో స్వప్నం ముగిసింది. ఈ దివ్యస్వప్నం నాకు ఎంతో ఆనందం కలిగించింది.  ఆ తరువాత వివిధ సందర్భాలలో గురువుగారు స్వప్న దర్శనాలిచ్చారు.

అక్టోబరు 2009 నుండి నేను యుఎస్ఎకు ప్రాజెక్ట్ పనిమీద వెళ్లాను. అందువలన తరచుగా కాలిఫోర్నియా వెళ్ళి వస్తుండేవాడిని. అక్కడ కూడా ఒక చక్కటి బాబా ఆలయానికి దగ్గరగా నాకు బస ఏర్పాటు చేసారు గురువుగారు. తరచుగా ధూప్ ఆరతికి, కొన్నిసార్లు కాకడ ఆరతికి వెళ్లే అవకాశం కలిగింది. ఎంతో సంతోషమైనది. మనము ఎన్ని వేల మైళ్ల దూరంలో ఉన్నా వారు ఎప్పుడూ మనతోనే ఉంటారు. ఇంకా అదే ప్రాజెక్ట్ పనిమీద ఉన్నాను. జనవరి 2010లో



యుఎస్ఎ లో ఉన్నపుడు గురువుగారు వ్రాసిన భజనలను నా అంతట నేను పాడుకోవడం మొదలు పెట్టాను. నాకు ఆ ప్రేరణను కలిగించి, ఎంతో చక్కగా అన్ని భజనలను పాడుకునే భాగ్యాన్ని గురువుగారు నాకు కలిగించారు. వాటిని నా కంప్యూటర్‌లో రికార్డు చేసుకున్నాను. ఫిబ్రవరి 2010లో యుఎస్ఎ నుండి తిరిగి వచ్చి శిరిడీ వెళ్లాను. నేను వచ్చిన రోజు అమ్మగారు కూడా శిరిడీ వచ్చి ఉన్నారు. శిరిడీ చేరిన రోజునే సాయంకాలం సత్సంగం ముగుస్తున్నపుడు నా కోసమే వచ్చినట్లు అమ్మగారు సాయిపథంకు వచ్చి ఆరతి ఇచ్చారు. నా ఆనందానికి అవధులు లేవు. అమ్మదర్శనం కలగడం ఎంతో అదృష్టంగా భావించాను. నేను గురువుగారికి వ్రాసిన లెటర్ స్వయంగా అమ్మగారే తీసుకున్నారు. అందులో మా అమ్మ పరిస్థితి తెలియచేస్తూ, ఆమె సులువుగా చివరి రోజులు గడపాలని, సద్గతిని పొందాలని కోరుకున్నాను. నేను రికార్డు చేసిన భజనలను అమ్మగారికి అందచేసాను.

గురువుగారి కృపను ఇంక ఏమని చెప్పను? శిరిడీ నుండి తిరిగి వచ్చి మరల యుఎస్ఎ వెళ్లినపుడు గురువుగారు ఇంకొక దర్శనమిచ్చారు. గురువుగారు చిరునవ్వుతో కూర్చుని ఉన్నారు. "మీరింక శిరిడీలో దర్శనాలు ఇవ్వరని తెలిసి, చాలా బాధగా ఉంది గురువుగారూ! మీ నిర్ణయం మార్చుకోగలరా" అని అడిగాను. దానికి గురువుగారు "ఆ... అది కష్టం" అన్నారు. "పోనీ ఇక్కడ మీ పాదాలకు దణ్ణం పెట్టుకోవచ్చా" అని అడిగాను. "పెట్టుకో" అన్నారు ఆయన. ***అహమన్నదే లేని ఆ పరమాత్మతత్వం, నిరాడంబరత చూస్తే నాకు మహా సిగ్గు కలుగుతుంది. మరల ఎంతో ముచ్చటగాను ఉంటుంది.*** బాబా-గురుదేవుల చల్లని అనుగ్రహంతో మా అమ్మ ఎంతో సులువుగా వారి నామాలు స్మరిస్తూ వారిని చేరుకున్నది. గురువుగారి ప్రేరణతో అన్ని పాత గురుకృప సంచికలను ఇంటర్‌నెట్ నుండి ప్రింట్ తీసుకొని మొత్తం చదువగలిగాను. అమ్మకూడా అన్నీ చదివింది. ఇప్పుడు మీ అందరితో నా అనుభవాలను పంచుకునే భాగ్యం కలిగించినందుకు బాబాకు, గురుదేవులకు నా హృదయపూర్వక నమస్సులు. వారి అనుగ్రహం మన అందరి మీద సదా ఉండాలని, వారి కృపతో మనకు కూడా వారి జగత్కార్యంలో ఒక చిన్న పాత్ర దొరకాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

***-ఉమాశంకర్, బెంగళూరు***

**గురువు జీవితాన్ని వెల్లడి చేసి, ఆయన సందేశాన్ని**

**వ్యాప్తి చేసే వ్యక్తే నిజమైన శిష్యుడు**

సాయి సమగ్రదర్శిని : **www.saibaba.com**

సద్గురు తత్త్వ దర్శిని : **www.gurukrupa.info**

గురుబంధువులు తమ అనుభవాలను పంపవలసిన mail ID :

**gurukrupa@saimail.com**


జీవన్ముక్తుడు నడుపుతుంటే - జీవన్ముక్త స్థితి రాకుండా వుంటుందా!



తమ వెలుగుకు దగ్గరైన వారిని అభిమానులుగా కాక అనుయాయులుగా,
సేవకులుగా తీర్చి దిద్దే వారాయన.

అనుయాయులు అంటే తనను అనుసరించే వారుగాకాక, తాను ఏ వెలుగును
అనుసరిస్తున్నారో ఆ వెలుగుకు అనుయాయులుగా -

సేవకులు అంటే తనను సేవించే వారుగా కాక తనలా ఆర్త జనులను
సేవించే వారిగా ఆయన తీర్చి దిద్దుతుంటారు.


తవ నామ సదా శుభసాధకహే
పతితాధమ మానవ పావకహే
మన యేన రహే తవ శ్రీచరణే
గురుదేవ దయాకర దీనజనే